# పెన్ పవర్

10 YEAR ANNIVERSARY 2014 - 2024

తెలంగాణ రౌండప్

సోమవారం | 16 డిసెంబర్ 2024 | పేజీలు 8




చింతల్‌లోని రెండు అనుమతుల అక్రమ కట్టడం.. జూలై 6న తీసిన నాటి ఫోటో..

# రెసిడెన్షియల్ అనుమతులు..
# కమర్షియల్ కట్టడం

## చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ప్రయోజనం..? ఉత్సవ విగ్రహంలా జోనల్ కమిషనర్..



2024 జూలై 6న కూల్చివేతలు చేపడుతున్న..నాటి ఫైల్ ఫోటో..

- అక్రమ నిర్మాణంలో ఆసుపత్రికి అనుమతి ఇవ్వ వద్దని మేడ్చల్ డిఎంహెచ్ఓకి స్థానికుల విజ్ఞప్తి..!
- భవనానికి "ఆక్యుపెన్సీ సర్టిఫికేట్" లేకపోయినా..! "ఫైర్ ఎన్ఓసికి" ప్రయత్నం..
- మరోవైపు "రెండు రెసిడెన్షియల్ అనుమతులతో..! ఒకటే కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం..
- చింతల్ మెయిన్ రోడ్‌లోని ఈ అక్రమ నిర్మాణాన్ని 2024 జూలై 6న కూల్చివేతలు..పాక్షికమే..!


మాధవ్ పత్తి..


**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, డిసెంబర్ 15:**
తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత..గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన టిజి-బిపాస్ చట్టం..! సంబంధిత అధికారులకు కల్పతరువుగా మారిందని చెప్పవచ్చు.. ప్రారంభంలో అత్యంత కఠినమైన నిబంధనలతో (ఎలాంటి నోటీసులు జారీ చేయకుండానే కూల్చివేసే విధంగా) చట్టాన్ని రూపొందించి నప్పటికీ..! తెలివిగా చట్టసవరణ చేయించడంలో టౌన్‌ప్లానింగ్ అధికారులే కీలకపాత్ర పోషించినట్లు ఆరోపణలు వచ్చాయి.. మున్సిపల్ చట్టాన్ని అమలు చేసిన గత ప్రభుత్వం..! ఆచరణలో పెట్టేందుకు అధికారులపై ఒత్తిడి తీసుకురాకుండా "పాలకులు" హుకుంజారీ చేయడం..! జిల్లా, గల్లీ నాయకుల మాటను జవదాటకూడదనే అన్ని ప్రభుత్వ శాఖలకు అనధికారికంగా ఆదేశాలు ఉండేవట..? దీంతో "తిలాపాపం తలాపిడికెడు" అన్న చందంగా "దొంగలు దొంగలు ఊర్లు పంచుకున్న" తీరుకు అద్దం పడుతున్నారని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి.. అటు టిజి-బిపాస్ చట్టాన్ని నిర్వీర్యం చేశారు..! ఇటు కొందరు కేవలం పార్టీ కండువాలు కప్పుకుని నేతలుగా చలామణి అవుతూ..! అక్రమ నిర్మాణాలపై వసూళ్ళకు పాల్పడే కుటుంబాలు లేకపోలేదు..! ఈ అక్రమ నిర్మాణం విషయంలో ముందుగా తమ్ముని ఫిర్యాదుతో కూల్చివేతలు, తర్వాత అన్న ఫిర్యాదుతో సీల్ చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి.. టౌన్‌ప్లానింగ్ అధికారుల విధులు, ప్రజలకు ఏమేరకు ఉపయోగ పడుతున్నాయో ఏమోకానీ..! అక్రమార్కులకు, అధికారులకు, నేతలకు మాత్రం జేబులు నింపుతున్నాయని అర్థమవుతుంది.. ఈ మొత్తం వ్యవహారంలో "ముడుపులు" కామన్‌గా నిలుస్తున్నాయని స్పష్టమవుతుంది..




జీహెచ్ఎంసి మొహ్రుదక బోర్డు..



అక్రమ భవనానికి తాళం వేసి సిల్ వేసిన దృశ్యం..



జీహెచ్ఎంసి అధికారులు సీజ్ చేసిన చింతల్‌లోని అక్రమ నిర్మాణం..

- అప్పుడు ఓ బీఆర్ఎస్ నాయకుని వాటా రాలేదని జూలై 6న కూల్చివేశారని ఆరోపణలు..
- ఆతర్వాత ముడుపులు ముట్టగానే పనులు చేసుకునే వెసులుబాటు కల్పించిన వైనం..
- అక్రమ నిర్మాణ దారుడు..ఇప్పుడు భవనాన్ని ఆసుపత్రికి లీజుకు ఇచ్చారని కాంగ్రెస్ నేత ఫిర్యాదు..
- సంబంధిత అక్రమ కట్టడాన్ని రెండు రోజుల క్రితం మళ్ళీ సీజ్ చేసిన సర్కిల్-25 టౌన్‌ప్లానింగ్..
- అటు అక్రమార్కులకు.. ఇటు అధికారులకు కామధేనువుగా మారిన "ఇల్‌లీగల్ కన్‌స్ట్రక్షన్స్"..
- ప్రమాదకర కట్టడాల్లో ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి.. ప్రైవేట్ ఆస్పత్రులకు లీజుకు ఇస్తున్న వైనం..
- టిజి-బిపాస్ చట్టంలోని లోపాలు..! అధికారులకు, కల్పతరువుగా మారిన వైనం..!


-2లో


## అధికారుల నిర్లక్ష్యం..! రోడ్లపై మురుగు నీరు..

### ఐదేళ్ళుగా మరమ్మతులకు నోచుకోక రోడ్లపై డ్రైనేజీ నీటి ప్రవాహం..



- హ్యాట్రిక్ ఎమ్మెల్యే వివేకానంద.. స్థానిక కార్పోరేటర్ సమాధానం చెప్పాలన్న ఆకుల సతీష్ ఆగ్రహం..
- సూరారం రామ్‌లీలా మైదానం సమీపంలో డ్రైనేజీ ప్రవాహంతో స్థానికుల అవస్థలు..
- ప్రభుత్వ భూముల్లో రూ.60 లక్షల ఎస్‌డిఎఫ్ నిధులు దుర్వినియోగం చేసిన పెద్దమనిషి..
- ప్రజలు ఎదుర్కొనే సమస్యలకు ఎస్‌డిఎఫ్, సిడిపి నిధులు లేకపోవడం బాధాకరం..


-3 లో


## సీఎం ఆదేశాలు.. ఓల్డ్ సిటీ మెట్రో విస్తరణ పనులు స్పీడప్

హైదరాబాద్ పెన్ పవర్:ఓల్డ్ సిటీలో మెట్రో రైలు విస్తరణ కోసం భూసేకరణ పనులు స్పీడప్ అయ్యాయి. త్వరగా మెట్రో రైల్ ను పట్టాలు ఎక్కించేందుకు అధికారులు స్థల సేకరణ చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు దాదాపు ఏడున్నర కిలోమీటర్ల నిడివి గల MGBS నుంచి చంద్రా యణ గుట్ట మార్గంలో భూసేకరణ పనులు చేపడుతున్నారు అధికారులు.


-4 లో




# రెసిడెన్షియల్ అనుమతులు.. కమర్షియల్ కట్టడం..

## విడివిడిగా అనుమతులు..! ఒకటిగా నిర్మాణం..! వాట్ ఏన్ ఐడియా సర్‌జీ..!

నిర్ణీత గజాలవరకు మాత్రమే, రెసిడెన్షియల్ అనుమతులు, మార్టిగేజీల బెడద ఉండదు.. ఆపైన అధికంగా ఉంటే కమర్షియల్ అనుమతులకు వెళ్లాల్సిందే..! స్థలం ఎక్కువగా ఉన్నట్లయితే మున్సిపాలిటీకి కొంత శాతం "మార్టిగేజి" చేయాలి.. నిర్మాణంలో లోపాలు లేకుంటే ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ ఇస్తారు.. లేకపోతే "ఓసి" ఇవ్వరు.. మార్టిగేజి విడుదల కాదు.. ఇవన్ని నిర్మాణదారులతో కూర్చుని, టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్చిస్తారు.. ఆతర్వాత

అధికారుల సలహాలు.. అక్రమార్కుల జిమ్మిక్కులు ఏకమైతే..! ఎలాంటి తప్పుడు కట్టడాలు నిర్మితం అవుతాయి.. కూకట్‌పల్లి జోనల్ పరిధిలోని కుత్బుల్లాపూర్ సర్కిల్-25 చింతల్ మెయిన్ రోడ్‌లో వేరు వేరు రెండు ప్లాట్‌లకు "రెసిడెన్షియల్ అనుమతులు తీసుకున్న ఓ యజమాని కక్కుర్తి..! "లోబికి ఇమ్మడి ఖర్చు" అన్నచందంగా తయారైంది.. సదరు నిర్మాణదారుడు రెండు అనుమతులతో నిబంధనలు ఉల్లంగించి ఒకే భవనాన్ని నిర్మించాడు.. అయితే ఈ భవనంపై గతంలో జులై నెలలో కుత్బుల్లాపూర్ టౌన్ ప్లానింగ్ అధికారులకి పిర్యాదులు రావటంతో కూల్చివేతలు చేపట్టి చర్యలు తీసుకున్నారు.. లెక్కచేయని, నిర్మాణదారుడు అక్రమ నిర్మాణంలో పనులు ఆపకుండా పూర్తి చేశాడు.. అదే భవనాన్ని ఓ ప్రైవేటు ఆసుపత్రికి లీజుకు ఇచ్చాడు. అనుమతి లేని ఇరుకైన భవనంలో, ఆస్పత్రి ఏర్పాటు చేసేందుకు మళ్లీ పనులు ప్రారంభించారు.. ప్రజలను ప్రమాదంలో పెట్టే విధంగా..! అక్రమ నిర్మాణంలో ఆసుపత్రి నిర్వహణకై ఏర్పాట్లు చేస్తుండగా.. పలువురు జోనల్ కమిషనర్‌కి, ఫిర్యాదు చేసినట్లు సమాచారం..

- మొదటి పేజి తరువాయి

కుత్బుల్లాపూర్ జీహెచ్‌ఎంసి సర్కిల్-25 టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరు "బహు చూడముచ్చటగా నున్నది"..

ఇక్కడ నిర్మాణ అనుమతులతో పనిలేదు..! నిబంధనలతో అవసరమే లేదు..! రెసిడెన్షియల్, కమర్షియల్, అన్న తేడా అస్సలే లేదు..! ప్రజలను ప్రమాదంలో పెట్టే అక్రమ కట్టడాలు ఏవైనా..! ప్రోత్సహించడమే..! సీజింగ్‌లు, నోటీసులు తాత్కాలికమే..! అధికారులకు నిధులు సమకూర్చే నిర్మాణాలంటే అమితమైన ప్రేమ, అనడంలో సందేహం లేదు.. అదేంటో నేటి ఈ అక్రమ నిర్మాణం విషయంలో చూద్దాం.. "మేము కూల్చివేసినట్లు" వ్యవహరిస్తాం..! "మీరు ఏడ్చినట్లు చేయండి, అడ్డుకోండి"..! ఇదంతా అధికారులకు అక్రమార్కులకు నడుమ అంతర్గత ఒప్పందాలలో భాగమని ఆరోపిస్తున్నారు.. నిబంధనలు ఉల్లంఘించి నిర్మించిన ఓ అక్రమ ప్రమాదకర భవనం విషయంలో..! చిత్రవిచిత్రాలు చోటు చేసుకుంటున్నాయి.. ఒకవైపు జిహెచ్‌ఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారులు "2024 జూలై 6న" కూల్చివేతలు చేపట్టిన అదే భవనంలో..!మరోవైపు ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఏర్పాటుకు పనులు ప్రారంభించారు.. ఇప్పటికే రెండు రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని..! ఒకటే కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించారు.. సంబంధిత కట్టడంపై కుత్బుల్లాపూర్ జిహెచ్‌ఎంసి అధికారులు ఇప్పటికే రెండుసార్లు కూల్చివేతలు చేపట్టినప్పటికీ..! నిర్మాణదారుడు అక్రమ నిర్మాణంలో పనులు పూర్తి చేస్తుండగా జిహెచ్‌ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు భవనాన్ని సీజ్ చేశారు..

## ఆస్పత్రికి అద్దెకు ఇచ్చిన భవనం సీజ్ చేసిన జిహెచ్‌ఎంసి అధికారులు..

నిబంధనలు బేఖాతర్ చేస్తూ రెండు అనుమతులతో ఒకే భవనాన్ని నిర్మించి..! రెసిడెన్షియల్ అనుమతులతో కమర్షియల్ భవనంగా రూపుదిద్దుకున్న అక్రమ కట్టడంపై ఫిర్యాదులు అందుకున్న జీహెచ్‌ఎంసి అధికారులు పలుమార్లు నోటీసులు ఇచ్చారు.. నిర్మాణదారుడు పనులను నిలిపివేకపోవడంతో ప్రజా ప్రయోజనాల దృష్ట్యా

ఈ మేరకు స్పందించిన కుత్బుల్లాపూర్ జిహెచ్‌ఎంసి అధికారులు టౌన్ ప్లానింగ్ ఏసిపి సురేందర్ రెడ్డి ఆదేశాలతో టిపిఎస్ రమేష్ ఆధ్వర్యంలో ఆసుపత్రికి అద్దెకు ఇచ్చిన అక్రమ భవనంపై అధికారులు చర్యలు చేపట్టారు. నిబంధనలు ఉల్లఘించి నిర్మించిన భవనాన్ని "టిజి-బిపాస్ ఆక్ట్ ప్రకారం సీజ్ చేసినట్లు టౌన్ ప్లానింగ్ అధికారులు రమేష్ వెల్లడించారు. జిహెచ్‌ఎంసి నిబంధనలు పాటించకుండా సీజింగ్‌ను అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదవుతాయని నిర్మాణదారులను అధికారులు హెచ్చరించారు.. అయినప్పటికీ సదరు అక్రమ భవనంలో ఆస్పత్రి నిర్వహణకై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నుండి అనుమతులు, ఫైర్ సేఫ్టీ అధికారులు ఎన్‌ఓసి ఇస్తే రోగుల ప్రాణాలకు ప్రమాదం తలపెట్టినట్లు అవుతుందని, తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు..

## చింతల్ అక్రమ నిర్మాణం సీల్ వేసిన సిబ్బంది..

















మురుగునీటి దుర్గంధంతో ప్రజలు అవస్థలు..



బాలనగర్ జోన్ వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్‌కి గతవారం ఫిర్యాదు.

## అధికారుల నిర్లక్ష్యం..!

# రోడ్లపై మురుగు నీరు

## ఐదేళ్ళుగా మరమ్మతులకు నోచుకోక రోడ్లపై డ్రైనేజీ నీటి ప్రవాహం..

- హ్యాట్రిక్ ఎమ్మెల్యే వివేకానంద.. స్థానిక కార్పొరేటర్ సమాధానం చెప్పాలన్న ఆకుల సతీష్ ఆగ్రహం..
- సూరారం రామ్‌లీలా మైదానం సమీపంలో డ్రైనేజీ ప్రవాహంతో స్థానికుల అవస్థలు..
- ప్రభుత్వ భూముల్లో రూ.60 లక్షల ఎస్‌డిఎఫ్ నిధులు దుర్వినియోగం చేసిన పెద్దమనిషి..
- ప్రజలు ఎదుర్కొనే సమస్యలకు ఎస్‌డిఎఫ్, సిడిపి నిధులు లేకపోవడం బాధాకరం..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, డిసెంబర్ 15:** ప్రభుత్వ భూమి కబ్జాదారులకు ఉన్న పలుకుబడి, సామాన్య ప్రజలకు లేకపోవడం..! అలాంటి ప్రజాప్రతినిధులను ఎన్నుకున్న ప్రజలు ఇలాంటి ఇబ్బందులు తప్పవా..? హైకోర్టు పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమిలో రూ.60 లక్షలు పంచాయతీరాజ్ శాఖ నుండి ఎస్‌డిఎఫ్ నిధులు సాంక్షన్ చేయించి..! ప్రజాధనం దుర్వినియోగంతో సీసీరోడ్లు వేయించిన ప్రజాప్రతినిధికి..! సూరారం డ్రైనేజీ సమస్య తెలియక పోవడం దురదృష్టకరం.. కుత్బుల్లాపూర్ జీహెచ్‌ఎంసి సర్కిల్-25 పరిధిలోని సూరారం రామ్ లీలా మైదాన్ సమీపంలో డ్రైనేజ్ మ్యాన్ హెూల్స్ మరమ్మతులకు నోచుకోక గత ఐదు సంవత్సరాలుగా డ్రైనేజీ పొంగిపొర్లుతున్నా పట్టించుకోని జిహెచ్‌ఎంసి, వాటర్ వర్క్స్ అధికారులు.. దీనికి తోడు హ్యా ట్రిక్ ఎమ్మెల్యే వివేకానంద, స్థానిక కార్పొరేటర్ సమాధానం చెప్పాలని ఆకుల సతీష్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.. స్థానికులతో కలిసి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా "ఎక్కడ వేసిన గోగళి అక్కడే" అన్న చందంగా తయారైందని ఆరోపించారు..

### రూ.45 లక్షలు సాంక్షన్ చేయించలేని ప్రజాప్రతినిధి..

వాటర్ వర్క్స్ బాలనగర్ జోన్ జనరల్ మేనేజర్‌కి ఈనెల 9న ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని ఆకుల సతీష్ ఆరోపించారు.. కనీసం 45 లక్షలు సాంక్షన్ చేయించి పనులు చేయించలేని హ్యాట్రిక్ ఎమ్మెల్యే..! ప్రెస్‌మీట్‌లు పెట్టి కోతలు మాత్రం కోస్తాడని సతీష్ విమర్శించారు.. గతవారం ఫిర్యాదు చేశామని, వాటర్ వర్క్స్ నుండి 45 లక్షలు కొత్త డ్రైనేజీ నాలా నిర్మాణానికి మంజూరు చేయించడానికి తమ వంతు ప్రయత్నం చేస్తామని ఆకులు సతీష్ తెలిపారు.. ఇప్పటికైనా ఓట్లు వేసి గెలిపించిన ఎమ్మెల్యే వివేకానంద,స్థానిక కార్పొరేటర్‌ని డ్రైనేజీ సమస్యపై ప్రజలు నిలదీయాలని అన్నారు.. బూటక హామీలతో గెలిచిన ప్రతినిధులకు భవిష్యత్తులో బుద్ధి చెప్పాలని ఆకుల సతీష్ కోరారు.



సూరారం కాలనీలో పొంగి పొర్లుతున్న డ్రైనేజీ నీరు..



## సీఎం ఆదేశాలు.. ఓల్డ్ సిటీ మెట్రో విస్తరణ పనులు స్పీడప్

- మొదటి పేజీ తరువాయి

ఇప్పటికే గుర్తించిన 1 వెయ్యి 100 ప్రభావిత ఆస్తుల సేకరణ కొనసాగుతోంది. ఈ ప్రభావిత ఆస్తుల్లో ఇప్పటికే 900 ఆస్తులకు సంబంధించిన రిక్విజిషన్ ని జిల్లా కలెక్టర్ కి సమర్పించామన్నారు హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి. 800 ఆస్తులకు సంబంధించిన ప్రిలిమినరీ నోటిఫికేషన్ ను దఫదఫాలుగా కలెక్టర్ జారీ చేసారన్నారు. నోటిఫై చేసిన ఆస్తులలో 400 ఆస్తులకు ప్రిలిమినరీ డిక్లరేషన్ ను కలెక్టర్ జారీ చేశారన్నారు ఎన్వీఎస్ రెడ్డి. 200 ప్రభావిత ఆస్తుల పరిహారానికి సంబంధించిన అవార్డులను ఈ నెలాఖరులోగా ప్రకటించడం పూర్తవుతుందన్నారు. తర్వాత వెంటనే వాటికి పరిహారం చెల్లించి, వాటిని కూల్చే పనులు ప్రారంభం అవుతాయన్నారు ఎన్వీఎస్ రెడ్డి. ఈ మార్గంలో ఉన్న వివిధ నిర్మాణాలు, ప్రభావిత ఆస్తుల యాజమానులతో సానులంగా చర్చిస్తున్నామన్నారు. భూసేకరణ చట్టం ప్రకారం స్థలం సేకరించి రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నామన్నారు ఎన్వీఎస్ రెడ్డి.రోడ్డు విస్తరణలోను, మెట్రో నిర్మాణంలోను మతపరమైన, చారిత్రక కట్టడాలన్నిటినీ తప్పించి వాటిని ఇంజినీరింగ్ సొల్యూషన్ల తో పరిరక్షిస్తున్నామన్నారు ఎన్వీఎస్ రెడ్డి. మెట్రో రైల్ రాకతో పాత నగరం ఎంతో ఆకర్షణీయ ప్రాంతంగా రూపుదాల్చనుందన్నారు. ఉపాధి అవకాశాలు మెరుగు కావడమే కాకుండా, కాలుష్య రహితంగా ఈ ప్రాంతమంతా అభివృద్ధి సాధించనుందన్నారు ఎన్వీఎస్ రెడ్డి. భూసేకరణ ప్రక్రియను నిరంతరం సమీక్షిస్తూ..పనుల ప్రగతిని ఎప్పటికప్పుడు సీఎం రేవంత్ కు వివరిస్తున్నామన్నారు ఎన్వీఎస్ రెడ్డి.

## సీఎం రేవంత్ రెడ్డితో టీటీడీ అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి భేటీ..



**హైదరాబాద్ పెన్ పవర్:**సీఎం రేవంత్ రెడ్డితో టీటీడీ అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి భేటీ అయ్యారు. జూబ్లీహిల్స్ లోని నివాసంలో సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు టీటీడీ అడిషనల్ ఈఓ వెంకయ్య చౌదరి.అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఈ భేటీకి భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. తిరుమల దర్శనాల విషయంలో తెలంగాణ ప్రజాప్రతినిధుల అసంతృప్తిగా ఉన్న అంశం,తెలంగాణ లో టిటిడి కళ్యాణ మంటపాల నిర్మాణం వంటి అంశాలు ఈ భేటీలో చర్చించినట్లు తెలుస్తోంది.తిరుమలలో తెలంగాణ భక్తులకు సౌకర్యాల కల్పన, తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖల అంశం, తిరుమలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున వసతి భవనం నిర్మాణం వంటి అంశాలు కూడా ఈ భేటీలో చర్చించినట్లు సమాచారం.

# తన దాడిలో గాయపడిన టీవీ రిపోర్టర్ ను పరామర్శించిన మోహన్ బాబు

- ఇటీవల మోహన్ బాబు కుటుంబంలో ఆస్తుల వివాదం
- మోహన్ బాబు నివాసంలోకి ప్రవేశించిన మీడియా రిపోర్టర్లు
- టీవీ9 రిపోర్టర్ రంజిత్ కుమార్ పై మోహన్ బాబు దాడి
- ఆసుపత్రిలో చేరిన రిపోర్టర్
- స్వయంగా కలిసి క్షమాపణ చెప్పిన మోహన్ బాబు

**హైదరాబాద్ పెన్ పవర్:**ఇటీవల ప్రముఖ నటుడు మోహన్ బాబు కుటుంబంలో ఆస్తుల వివాదం చెలరేగడం తెలిసిందే. ఈ క్రమంలో తన నివాసంలోకి ప్రవేశించిన మీడియా రిపోర్టర్లపై మోహన్ బాబు ఉగ్రరూపం ప్రదర్శించారు. టీవీ9 చానల్ రిపోర్టర్ రంజిత్ కుమార్ చేతిలోంచి మైక్ ను లాక్కున్న మోహన్ బాబు... ఆ మైక్ తో సదరు రిపోర్టర్ పై దాడి చేశారు. గాయపడిన

రిపోర్టర్ రంజిత్ కుమార్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో నేడు ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. మోహన్ బాబు తన కుమారుడు మంచు విష్ణుతో కలిసి రంజిత్ కుమార్ చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లారు.

ఆ రిపోర్టర్ కు క్షమాపణలు తెలియజేశారు.



చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత రిపోర్టర్ కుటుంబ సభ్యులతోనూ మోహన్ బాబు మాట్లాడారు. ఆ రోజు తన నివాసంలో జరిగిన ఘటన పట్ల విచారం వ్యక్తం చేశారు.

# మహారాష్ట్రలో కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారం... బీజేపీ వద్దే కీలక శాఖలు

- ఇటీవలే ముగిసిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు
- అధికారం నిలబెట్టుకున్న మహాయుతి కూటమి
- 132 స్థానాలతో అతిపెద్ద పార్టీగా బీజేపీ
- ముఖ్యమంత్రిగా బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్
- బీజేపీకి 19 మంత్రి పదవులు
- బీజేపీకి హెూంశాఖ, రెవెన్యూ శాఖ



**హైదరాబాద్ పెన్ పవర్:**మహారాష్ట్రలో ఇటీవలే అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. బీజేపీ-శివసేన-ఎన్సీపీలతో కూడిన మహాయుతి కూటమి ఘనవిజయం సాధించి అధికారం నిలబెట్టుకుంది. ఈసారి బీజేపీ (132) అత్యధిక స్థానాలు గెలుచుకున్న అతి పెద్ద పార్టీగా అవతరించింది. శివసేన (షిండే వర్గం) 57 స్థానాలు, ఎన్సీపీ (అజిత్ పవార్ వర్గం) 41 స్థానాలల్లో గెలిచాయి. ఎక్కువ స్థానాల ఆధారంగా ఈసారి బీజేపీకి చెందిన దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రి అయ్యారు. శివసేన అధినేత ఏక్ నాథ్ షిండే, ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్ డిప్యూటీ సీఎం పోస్టులు చేపట్టారు. వీరు ఇటీవలే ప్రమాణ స్వీకారం చేశారు. కాగా, నేడు మిగతా మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేసింది. నాగపూర్ లో జరిగిన ఓ కార్యక్రమంలో కొత్త మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. కీలక శాఖలను బీజేపీ తన వద్దే ఉంచుకుంది. బీజేపీకి హెూంశాఖ, రెవెన్యూ శాఖలు లభించాయి. ఎన్సీపీకి ఆర్థికశాఖ, శివసేననకు రవాణా శాఖ, వైద్య ఆరోగ్య శాఖలు దక్కాయి. మొత్తమ్మీద, గెలిచిన ఎమ్మెల్యేల దామాషా ప్రకారం బీజేపీకి 19 మంత్రి పదవులు దక్కగా... శివసేనకు 12, ఎన్సీపీకి 9 మంత్రి పదవులు కేటాయించారు.

# మంచు ఫ్యామిలీలో మళ్లీ గొడవ.. పోలీసులకు ఫిర్యాదు చేసిన మనోజ్



**హైదరాబాద్ పెన్ పవర్:** మంచు ఫ్యామిలీలో మరోసారి వివాదం రాజుకుంది. 2024, డిసెంబర్ 14 శనివారం రాత్రి జల్ పల్లిలోని తన నివాసంలో స్నేహితులతో కలిసి మంచు మనోజ్ పార్టీ ఏర్పాటు చేశాడు. పార్టీకి విద్యుత్ సరఫరా కోసం మనోజ్ బయట నుండి జనరేటర్లను తెప్పించాడు. మనోజ్ ఇంట్లో పార్టీ ఏర్పాటు చేయడంతో అసహనానికి గురైన విష్ణు.. తన మనుషులతో మనోజ్ ఇంట్లోని జనరేటర్లలో పంచదార వేయించాడు. ఈ విషయాన్ని మనోజ్ గమనించడంతో మరోసారి అన్నదమ్ముల మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకున్నట్లు సమాచారం. విష్ణు మనుషులు జనరేటర్ లో పంచదార పోయడానికి సంబంధించిన ఆధారాలతో పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసేందుకు మనోజ్ రెడీ అయ్యాడు. దీంతో మరోసారి మంచు ఫ్యామిలీ వివాదం మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఆదివారం (డిసెంబర్ 15) రాత్రి 7 గంటలకు పహడి షరీఫ్ పోలీస్ స్టేషన్ కు వెళ్లి మనోజ్ ఫిర్యాదు చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దంటూ మనోజ్, విష్ణు ఇద్దరితో రాచకొండ సీపీ బాండ్ రాయించుకోగా.. వీరి మధ్య మరోసారి గొడవ జరగడం హాట్ టాపిక్ గా మారింది.

కాగా, గత 10 రోజులుగా మంచు ఫ్యామిలీలో గొడవలు జరుగుతోన్న విషయం తెలిసిందే. డిసెంబర్ 10వ తేదీన హైదరాబాద్ శివారు జల్ పల్లిలోని మోహన్ బాబు నివాసం వద్ద చోటు హైడ్రామా చోటు చేసుకుంది. తండ్రి మోహన్ బాబు ఇంటికి ఆయన కుమారుడు మనోజ్ వెళ్లగా సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో మనోజ్ గేట్లు తోసుకుని బలవంతంగా మోహన్ బాబు ఇంట్లోకి వెళ్లాడు. ఈ క్రమంలో మోహన్ బాబు నివాసం వద్ద హై టెన్షన్ నెలకొంది. ఈ పరిణామాలతో తీవ్ర ఆగ్రహానికి గురైన మోహన్ బాబు.. తన ఇంటి వద్ద జరుగుతోన్న పరిస్థితులను కవరేజ్ చేసేందుకు వచ్చిన జర్నలిస్టులపై భౌతిక దాడులకు దిగాడు. ఏకంగా జర్నలిస్టుల చేతిలో మైకును లాక్కుని వారిపైనే దాడి చేశాడు. ఫ్యామిలీ ఇష్యూ, మీడియాపై దాడి చేయడంతో రాచకొండ పోలీసులు మోహన్ బాబుపై సీరియస్ అయ్యారు. మంచు ఫ్యామిలీ లొల్లి మరింత ముదరటంతో విచారణకు హాజరు కావాలంటూ మంచు మోహన్ బాబు, మనోజ్, విష్ణుకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. పోలీసుల ఆదేశాల మేరకు బుధవారం (డిసెంబర్ 11) మనోజ్, విష్ణు విచారణకు హాజరయ్యారు. అనారోగ్యం, కోర్టు మినహాయింపుతో మోహన్ బాబు పోలీసుల విచారణకు హాజరు కాలేదు. మరోవైపు.. జర్నలిస్ట్ పై దాడి ఘటనపై మోహన్ బాబుపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

# నిమిషం ఆలస్యం నిబంధన, అధికారుల నిర్లక్ష్యం వెరసి.. గ్రూప్ 2 పరీక్షకు దూరమైన బాలింత మహిళ..




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ వ్యాప్తంగా ( డిసెంబర్ 15, 2024 ) గ్రూప్ 2 పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఆదివారం, సోమవారం ( డిసెంబర్ 15, 16 ) రెండురోజుల పాటు జరగనున్న ఈ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 1, 368 సెంటర్లను ఏర్పాటు చేశారు అధికారులు. నిమిషం ఆలస్యమైనా కూడా పరీక్షకు అనుమతి లేదన్న నిబంధన ఉన్న నేపథ్యంలో అభ్యర్థులంతా అరగంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. అయితే.. కొంతమంది ఆలస్యంగా రావటంతో అధికారులు పరీక్షకు అనుమతించలేదు. ఇదిలా ఉండగా.. జనగామ జిల్లాలో అధికారుల నిర్లక్ష్యం, నిమిషం ఆలస్యం నిబంధన కారణంగా ఓ బాలింత పరీక్షకు దూరమైంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.

జనగామ పట్టణంలో పక్క పక్కనే రెండు పరీక్ష కేంద్రాలు ఉండడంతో పొరపాటున అరగంట ముందే మరో సెంటర్ కు వెళ్ళింది ఓ మహిళా అభ్యర్థి. అయితే.. ఆమె వేరే సెంటర్ కి వెళ్లిందన్న విషయం ఇన్విజిలేటర్ ఓఎంఆర్ షీటు, బయోమెట్రిక్ ప్రక్రియ వరకు గురించలేకపోయారు. మహిళా అభ్యర్థి సెంటర్ మారిందని గుర్తించే సమయానికే అరగంట వృధా అయ్యింది.

విషయం తెలుసుకున్న వెంటనే పక్కనే ఉన్న అసలు పరీక్ష కేంద్రానికి వెళ్ళింది బాలింత మహిళ. పరీక్షా కేంద్రానికి ఆలస్యంగా వెళ్లినందుకు అధికారులు అనుమతించలేదు. దీంతో చేసేదేమీ లేక పరీక్షా కేంద్రం నుండి కన్నీరు పెట్టుకుంటూ వెళ్ళిపోయింది మహిళా అభ్యర్థి. దీంతో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు


## మాలలే అంబేద్కర్ నిజమైన వారసులు : ఎమ్మెల్యే వివేక్



**హైదరాబాద్ పెన్ పవర్:** మాలలే అంబేద్కర్ నిజమైన వారసులన్నారు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి. ఏపీ గుంటూరులో మాలల సింహ గర్జనకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే వివేక్.. మాలలను విమర్శిస్తే ఊరుకునే ప్రసక్తే లేదు.. మాలలను విమర్శించే వ్యక్తులపైనే తమ పోరాటం అని చెప్పారు. ఆర్టికల్ 341 ప్రకారం సుప్రీంకోర్టు తీర్పు దళితులకు వ్యతిరేకంగా ఉందన్నారు వివేక్ . రిజర్వేషన్లపై సుప్రీం జడ్జి మెంట్ కొందరికే అనుకూలమని చెప్పారు. సుప్రీం తీర్పుపై సుప్రీం కోర్టులోనే కొట్లాడుతామన్నారు. క్రిమిలేయర్ ను ఒప్పుకునే ప్రసక్తే లేదన్నారు. దళితులకు 25 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు .దీనిపై మాలలు రాజకీయంగా కొంట్లాడాల్సిందేనన్నారు ఎమ్మెల్యే వివేక్.

మాలలు ధమ్ము ధైర్యం చూపించాలన్నారు ఎమ్మెల్యే వివేక్. మాలల దమ్ము ఏంటో ఈ మీటింగ్ తో తెలుస్తోంది.. తెలంగాణలో మాలల సత్తా ఏంటో చూపించాం... మాలల సత్తా ఏంటో ఈ రెండు మీటింగ్ లే చెబుతున్నాయన్నారు. అంబేద్కర్ లేకుంటే రిజర్వేషన్లు లేవన్నారు వివేక్ . వెనుక బడ్డ వర్గాలకు అంబేద్కర్ రిజర్వేషన్లు ఇచ్చారని తెలిపారు. దళితులను కాపాడటమే అంబేద్కర్ ఏకైక లక్ష్యమన్నారు. అంబేద్కర్ మాల, మాదిగ అని తేడా చూడలేదన్నారు వివేక్. దళితుల కోసం రాత్రింబవళ్లు కష్టపడ్డారని చెప్పారు. కొందరు దళితుల్లో చిచ్చు పెట్టే కుట్ర చేస్తున్నారని.. ఈ కుట్రను తిప్పి కొట్టే వరకు పోరాటం ఆగబోదన్నారు ఎమ్మెల్యే వివేక్. మాలలపై కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు ఎమ్మెల్యే వివేక్ . మాలలు ఎవరికీ అన్యాయం చేయలేదని..కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. మాలల సెల్ఫ్ రెస్పెక్ట్ ను కించ పరిచేప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మాలలు నిరంతర పోరాటం చేయాలని పిలుపునిచ్చారు వివేక్.

## తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో రికార్డు.. బాధితులకు రూ. 155 కోట్లు రిఫండ్



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో మరో రికార్డు సృష్టించింది. మెగా లోక్ అదాలత్ లో 4,893 మంది బాధితులకు రూ.33.27 కోట్లు రీఫండ్ చేసింది. గత ఏడాది కంటే లోక్ అదాలత్ ద్వారా రూ. 27.2 కోట్లు అదనంగా రికవరీ చేసింది. తెలంగాణ వ్యాప్తంగా రూ. 155.22 కోట్ల రూపాయలను బాధితులకు అందించింది. డిసెంబర్ 15 వరకు 17,210 మంది బాధితులకు రీఫండ్ చేసింది.

**లోక్ అదాలత్ లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన పోలీస్ కమిషనరేట్స్ :**

సైబరాబాద్: 2,136 కేసుల్లో రూ.12 కోట్ల 77 లక్షల 49 వేల 117 రీఫండ్

హైదరాబాద్: 268 కేసుల్లో రూ.8,84,17,621 రీఫండ్

రాచకొండ: 592 కేసుల్లో రూ.4,53,06,114 రీఫండ్

సంగారెడ్డి జిల్లా : 60 కేసుల్లో 1 కోటి 6 లక్షల 49 వేలు రీఫండ్

# దుబాయ్ లో స్పెషల్ టీ.. ఖరీదు జస్ట్ రూ.1.14 లక్షలే

వెండి కప్పులో బంగారం పూతతో గోల్డ్ కడక్ చాయ్

టీ తాగాక కప్పు తీసుకెళ్లవచ్చంటున్న యాజమాన్యం

దుబాయ్ లో భారత సంతతి వ్యాపారవేత్త రెస్టారెంట్ లో ఆఫర్



**హైదరాబాద్ పెన్ పవర్:**కప్పు టీ ఖరీదు మహా అంటే పదిహేను రూపాయలు.. అదే కాస్త ఖరీదైన రెస్టారెంట్ లో వందో రెండొందలో ఉంటుంది. స్టార్ హోటళ్లలో వేలల్లో ఉంటుందేమో కానీ దుబాయ్ లో మాత్రం కప్పు టీ రూ.1.14 లక్షలు.. అవును అక్షరాలా లక్షా పద్నాలుగు వేల రూపాయలు మాత్రమేనట. ఇంత ఖరీదా.. టీని బంగారంతో తయారుచేస్తున్నారా ఏంటి అనుకుంటున్నారా..? నిజమే బంగారంతోనే తయారుచేస్తున్నారు. స్వచ్ఛమైన వెండితో తయారుచేసిన కప్పులో బంగారు పూత (24 క్యారట్ బంగారంతో టాపింగ్) తో ఈ టీని స్పెషల్ గా సర్వ్ చేస్తారు. ఒక్కో సిప్ లో వేడివేడి చాయ్ తో పాటు బంగారాన్ని తాగేయొచ్చు.

టీ తాగాక కప్పును అక్కడే వదిలేయకుండా ఎంచక్కా ఇంటికి తెచ్చేసుకోవచ్చు. దుబాయ్ లోని బోహెూ కేఫ్ ఈ గోల్డ్ కడక్ చాయ్ ని సర్వ్ చేస్తోంది. భారత సంతతికి చెందిన సుచేత శర్మ ఈ కేఫ్ ను నడిపిస్తున్నాడు. తమ కస్టమర్ల కోసం, వారి హెూదాకు తగ్గట్లుగా స్పెషల్ గా ఈ టీని సర్వ్ చేస్తున్నామని సుచేత చెప్పారు. ఈ టీ తో పాటు గోల్డ్ సావనీర్ కాఫీ (రూ.1.09 లక్షలు) కూడా తమ కేఫ్ లో అందుబాటులో ఉందని వివరించారు. కాగా, బోహెూ కేఫ్ లో సర్వ్ చేసే ఈ స్పెషల్ టీని ఓ ఫుడ్ వ్లాగర్ వీడియో తీసి యూట్యూబ్ లో పెట్టారు. దీంతో ఆ వీడియో వైరల్ గా మారింది.

## ఆధార్ ఉచిత అప్ డేట్ గడువు మరోసారి పొడిగింపు

- పౌరుల గుర్తింపు కోసం ప్రామాణికంగా ఉన్న ఆధార్ కార్డు
- ఇప్పటికే పలుమార్లు ఉచిత అప్ డేట్ గడువు పొడిగించిన కేంద్రం
- తాజాగా మరో ఆర్నెల్ల పాటు గడువు పెంపు




**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలో ప్రభుత్వ, ప్రైవేటు పరంగా ఎలాంటి గుర్తింపుకైనా ఆధార్ కార్డు ప్రామాణికంగా ఉన్న సంగతి తెలిసిందే. కాగా, ఆధార్ కార్డుల్లో సవరణలు, అప్ డేట్ చేసుకోవడం కోసం కేంద్రం ఇప్పటికే పలుమార్లు గడువు పొడిగిస్తూ వచ్చింది. తాజాగా మరోసారి గడువు పెంచింది. వచ్చే ఏడాది జూన్ 25 వరకు ఎలాంటి రుసుం చెల్లించనవసరం లేకుండానే ఆధార్ అప్ డేట్ చేసుకోవచ్చని కేంద్రం తన ప్రకటనలో వెల్లడించింది. గతంలో పొడిగించిన గడువు నేటితో ముగియడంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది.

# నా ఫ్యామిలీని హత్య చేసేందుకు కుట్ర: విష్ణుపై ఫిర్యాదు చేసిన మనోజ్



**హైదరాబాద్ పెన్ పవర్:**మంచు ఫ్యామిలీలో మరోసారి విభేదాలు భగ్గుమన్నాయి. తన కుటుంబాన్ని హత్య చేసేందుకు సోదరుడు విష్ణు కుట్ర చేశాడని మనోజ్ పహాడి షరీఫ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన ఇంట్లోని జనరేటర్‌లో చక్కెర కలిపిన డిజిల్ పోసి.. విద్యుత్ సరఫరాలో భయంకరమైన హెచ్చుతగ్గులు వచ్చేలా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు మనోజ్.మా అమ్మ, నా తొమ్మిది నెలల పాప, బంధువులు ఇంట్లో తీవ్ర ఇబ్బంది పడ్డారని.. నేను, నా భార్య ఇంట్లో లేని సమయంలో ఇలా చేశారని తెలిపారు. నా సోదరుడు విష్ణుతో పాటు ఆయన అనుచరులు కలిసి ఈ కుట్ర పన్నారని ఆరోపించాడు. నా తల్లి బర్త్ డే అడ్డం పెట్టుకొని ఇంట్లోకి వచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. విష్ణు, అతడి అనుచరులపై దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలని మనోజ్ పోలీసులను కోరాడు. తనకు తన కుటుంబానికి భద్రత కల్పించాలని మనోజ్ పోలీసులకు విజ్ఞప్తి చేశాడు. కాగా, గత 10 రోజులుగా మంచు ఫ్యామిలీలో గొడవలు జరుగుతోన్న విషయం తెలిసిందే. డిసెంబర్ 10వ తేదీన హైదరాబాద్ శివారు జల్ పల్లిలోని మోహన్ బాబు నివాసం వద్ద చోటు హైడ్రామా చోటు చేసుకుంది. తండ్రి మోహన్ బాబు ఇంటికి ఆయన కుమారుడు మనోజ్ వెళ్లగా సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో మనోజ్ గేట్లు తోసుకుని బలవంతంగా మోహన్ బాబు ఇంట్లోకి వెళ్లాడు. ఈ క్రమంలో మోహన్ బాబు నివాసం వద్ద హై టెన్షన్ నెలకొంది.

ఈ పరిణామాలతో తీవ్ర ఆగ్రహానికి గురైన మోహన్ బాబు.. తన ఇంటి వద్ద జరుగుతోన్న పరిస్థితులను కవరేజ్ చేసేందుకు వచ్చిన జర్నలిస్టులపై భౌతిక దాడులకు దిగాడు. ఏకంగా జర్నలిస్టుల చేతిలో మైకును లాక్కునే వారిపైనే దాడి చేశాడు. ఫ్యామిలీ ఇష్యూ, మీడియాపై దాడి చేయడంతో రాచకొండ పోలీసులు మోహన్ బాబుపై సీరియస్ అయ్యారు. మంచు ఫ్యామిలీ లొల్లి మరింత ముదరటంతో విచారణకు హాజరు కావాలంటూ మంచు మోహన్ బాబు, మనోజ్, విష్ణుకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. పోలీసుల ఆదేశాల మేరకు బుధవారం (డిసెంబర్ 11) మనోజ్, విష్ణు విచారణకు హాజరయ్యారు. అనారోగ్యం, కోర్టు మినహాయింపుతో మోహన్ బాబు పోలీసుల దర్యాప్తుకు హాజరు కాలేదు. మరోవైపు.. జర్నలిస్ట్ పై దాడి ఘటనపై మోహన్ బాబుపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

# చిరంజీవి ఇంటికి చేరుకున్న అల్లు అర్జున్.. ఇందుకే వెళ్లాడు..!



**హైదరాబాద్ పెన్ పవర్:**ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మెగాస్టార్ చిరంజీవి ఇంటికి వెళ్లాడు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో అల్లు అర్జున్ జైలుకెళ్లొచ్చిన సంగతి తెలిసిందే. అయితే బన్నీ జైలుకు వెళ్లిన సమయంలో, జైలు నుంచి తిరిగొచ్చాక చిరంజీవి కుటుంబం అల్లు అర్జున్ కు, అతని కుటుంబ సభ్యులకు మద్దతు తెలిపింది. బన్నీ జైలు నుంచి విడుదల కాగానే చిరంజీవి భార్య సురేఖ అల్లు అర్జున్‌ను స్వయంగా ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

అల్లు అర్జున్ అరెస్ట్ వార్తలు మీడియాలో ప్రసారం కాగానే.. విషయం తెలుసుకున్న మెగా బ్రదర్ నాగబాబు జూబ్లీహిల్స్‌లోని అల్లు అర్జున్ ఇంటికి వెళ్లారు. ఇలా.. మెగాస్టార్ చిరంజీవి కుటుంబం కష్ట కాలంలో అల్లు కుటుంబానికి అండగా నిలిచింది. అందుకు కృతజ్ఞతగా చిరంజీవిని నేరుగా కలిసి ధన్యవాదాలు తెలిపేందుకు ఆయన నివాసానికి బన్నీ వెళ్లినట్లు తెలిసింది. అల్లు అర్జున్ తో పాటు ఆయన కుటుంబ సభ్యులు కూడా చిరంజీవి ఇంటికి వెళ్లారు. మెగా కుటుంబంతో కలిసి అల్లు కుటుంబం లంచ్ చేయనుంది.

%సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో అల్లు అర్జున్ జైలుకు వెళ్లి ఇంటికి రాగానే పలువురు సెలబ్రెటీలు అల్లు అర్జున్ ను కలిసి మద్దతు తెలిపారు. బన్నీని కలిసి మద్దతు తెలిపిన వారిలో పుష్ప సినిమా నిర్మాతలు నవీన్, రవిశంకర్, దర్శకుడు సుకుమార్, రాఘవేంద్ర రావు, దిల్ రాజు, విజయ్ దేవరకొండ, రానా, ఉపేంద్ర, థమన్, వంశీ పైడిపల్లి, కొరటాల శివ, వక్కంతం వంశీ, మంచు విష్ణు, సురేందర్ రెడ్డి, వెంకటేశ్, నాగచైతన్య, సుడిగాలి సుధీర్, సుధీర్ బాబు, శర్వానంద్, మారుతి, శ్రీకాంత్, బోయపాటి శీను, సిద్ధు జొన్నలగడ్డ, అఖిల్ తదితర సినీ ప్రముఖులు ఉన్నారు.

డిసెంబర్ 4న

రాత్రి 9.30కు హైదరాబాద్ లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లో ఉన్న సంధ్య థియేటర్ లో పుష్ప-2 సినిమా ప్రీమియర్ పడింది. ఈ ప్రీమియర్ షోను అభిమానులతో కలిసి వీక్షించేందుకు అల్లు అర్జున్ థియేటర్ కు వెళ్లాడు. అల్లు అర్జున్ ను చూసేందుకు అభిమానులు ఎగబడ్డారు. ఈ సమయంలో తొక్కిసలాట జరిగింది. ఈ తొక్కిసలాటలో రేవతి అనే మహిళ చనిపోయింది. ఆమె కొడుకు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దాదాపు 10 రోజుల నుంచి ఐసీయూలోనే చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై రేవతి భర్త భాస్కర్ చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సంధ్య థియేటర్ యాజమాన్యంతో పాటు తొక్కిసలాటకు కారణమైన అల్లు అర్జున్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరాడు. ఈ కేసులో సంధ్య థియేటర్ యజమానిని, మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అల్లు అర్జున్‌ను కూడా అరెస్ట్ చేశారు. ఈ కేసులో హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో అల్లు అర్జున్ బయటికొచ్చాడు.

# 'పుష్ప 2' తొక్కిసలాట... బాలుడి హెల్త్ బులిటెన్ విడుదల



**హైదరాబాద్ పెన్ పవర్:**పుష్ప 2 సినిమా సంధ్య థియేటర్ ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనలో వివాహిత రేవతి మృతి చెందిన విషయం తెల్సిందే. ఆమె తనయుడు శ్రీతేజ్ తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో జాయిన్ అయ్యాడు. గత పది రోజులుగా శ్రీతేజ్‌కి ఆసుపత్రి వర్గాలు చికిత్స అందిస్తున్నాయి. కానీ ఇప్పటి వరకు అతడు స్పృహలోకి రాలేదని వైద్యులు ప్రకటించారు. అప్పుడప్పుడు జ్వరం రావడంతో పాటు, శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతున్నాడు అంటూ వైద్యులు తాజాగా విడుదల చేసిన హెల్త్ బులిటెన్‌లో ప్రకటించడం జరిగింది.

గాయాలతో స్పృహ కోల్పోయిన బాలుడిని ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి వైద్యులు చాలా సీరియస్‌గా చికిత్స చేస్తూ బాలుడిని రక్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ సమయంలో బాలుడి ఆరోగ్యం గురించి ఆందోళన వ్యక్తం అవుతోంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడి ఆరోగ్య పరిస్థితి సీరియస్ అయ్యింది అంటూ నిన్న మీడియాలో కథనాలు వచ్చిన విషయం తెల్సిందే. దాంతో వైద్యులు అధికారికంగా హెల్త్ బులిటెన్ విడుదల చేశారు. ప్రస్తుతం బాలుడు ఇంకా ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. ఆయనకు అత్యవసర చికిత్సను అందిస్తున్నట్లు వైద్యులు పేర్కొన్నారు.

వెంటిలేటర్‌పై ఉంచి శ్రీతేజ్‌కి చికిత్స అందిస్తున్నామని, పది రోజుల నుంచి స్పృహలోకి అతడు రాలేదని వైద్యులు తెలియజేశారు. పూర్తి స్థాయిలో అతడు ఆరోగ్యంగా మారేందుకు సమయం పడుతుందని, ఇప్పటికీ అతడి పరిస్థితి సీరియస్‌గానే ఉంది అంటూ వైద్యులు తెలియజేశారు. పది రోజులు దాటినా బాలుడి ఆరోగ్య పరిస్థితిలో మార్పు కనిపించక పోవడం పట్ల కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద ఎత్తున ఆసుపత్రి చికిత్సకు ఖర్చు అవుతుందని, దాన్ని మైత్రి మూవీ మేకర్స్, అల్లు అర్జున్‌కి సంబంధించిన వారు భరిస్తున్నారనే వార్తలు వస్తున్నాయి.

సంధ్య థియేటర్ ఘటన నేపథ్యంలో నమోదు అయిన కేసులో హీరో అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి పోలీసులు అరెస్ట్ చేయడం, రిమాండ్‌కు పంపించడం, బెయిల్‌పై బయటకు రావడం అన్ని చకచక జరిగిన విషయం తెల్సిందే. మరో వైపు పుష్ప 2 సినిమా వసూళ్లు భారీ ఎత్తున నమోదు అవుతున్నాయి. వెయ్యి కోట్ల వసూళ్లు అతి తక్కువ సమయంలోనే నమోదు అయ్యాయి. ఇప్పటి వరకు రూ.1200 కోట్ల వసూళ్లు నమోదు అయ్యాయి. లాంగ్ రన్‌లో ఈ సినిమా ఎంత మొత్తం సాధిస్తుంది అనేది అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

# జమిలి బిల్లులపై కేంద్రం బ్యాక్.. అందుకేనా ఆలస్యం!




**హైదరాబాద్ పెన్ పవర్:**వచ్చే ఎన్నికలను జమిలి పద్ధతిలోనే నిర్వహించాలని కేంద్రం సంకల్పించింది. ఇందుకోసం.. ఇప్పటికే సగానికి పైగా ప్రక్రియను పూర్తిచేసింది. ఇక లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టడమే తరువాయి అన్నట్లుగా మిగిలిపోయింది. అయితే.. సోమవారం బిల్లులు లోక్‌సభ ప్రవేశపెట్టనున్నట్లు ముందుగా ప్రకటించిన కేంద్రం.. ఇప్పుడు బ్యాక్ స్టెప్ వేసినట్లుగా తెలుస్తోంది.

మిలి ఎన్నికల బిల్లు మీద కేంద్రం చివరి నిమిషంలో వెనక్కి తగ్గినట్లుగా తెలుస్తోంది. సోమవారమే లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపజేసేందుకు అన్నిరకాల కసరత్తులు పూర్తిచేశారు. అటు పార్టీల వారీగా తమ సభ్యులకు త్రీ లైన్ విప్ సైతం జారీ చేశారు. ఇందుకోసం.. లోక్‌సభ బిజినెస్‌లో జమిలి బిల్లుతోపాటు మరో బిల్లు ఆమోదించేందుకు కేంద్రం పొందుపరిచింది. కానీ.. చివరి నిమిషంలో ఏం జరిగిందో ఏమో కానీ.. లోక్‌సభ బిజినెస్‌లో ఆ రెండు బిల్లులను తొలగించింది. ఒక్కసారిగా కేంద్రం వెనక్కి తగ్గడంతో బిల్లుపై అనుమానాలు ప్రారంభం అయ్యాయి.

ఇప్పటికే జమిలి ఎన్నికల బిల్లుపై ఏ మాత్రం వెనక్కి తగ్గేది లేదంటూ ప్రధాని మోడీ ప్రకటించారు. అందుకు.. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రవేశపెడుతామంటూ కూడా ప్రచారం చేశారు. పార్లమెంటు శీతాకాల సమావేశాలు నవంబర్ 25వ తేదీన ప్రారంభమయ్యాయి. ఈ నెల 20తో ముగియనున్నాయి. అంటే.. వచ్చే శుక్రవారంతో సభలు వాయిదా పడనున్నాయి. ఈ టైములో బిల్లును ఆమోదింపజేయడం ఇప్పుడు మోడీ ప్రభుత్వానికి కీలకంగా మారిందని చెప్పాలి. చివరి నిమిషంలో వెనక్కి తగ్గడంపై పలు సందేహాలు వినిపిస్తున్నాయి.

సార్వత్రిక ఎన్నికలతో పాటు అన్ని రాష్ట్రాలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలని కేంద్రం ఆలోచిస్తోంది. అందుకోసం జమిలి ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. ఏటాదేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఎక్కడో ఓ చోట ఎన్నికలు లేదా ఉప ఎన్నికలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో ఎన్నికల కోడ్ అమలులోకి వస్తోంది. అలాగే.. వివిధ రాష్ట్రాల్లో అధికార యంత్రాంగం సైతం అంతా ఎన్నికల ప్రాసెస్‌లోనే ఉంటుంది. ఈ తరహా సమస్యల నుంచి బయటపడేందుకు జమిలి ఎన్నికలు నిర్వహించాలని మోడీ ప్రభుత్వం భావించింది. ఈ క్రమంలో బిల్లు ప్రవేశపెట్టడంపై వెనక్కి తగ్గడంపై పలురకాల చర్చలు జరుగుతున్నాయి. మరో ఐదు రోజుల్లోనే సమావేశాలు ముగియనున్న నేపథ్యంలో ఈ సమయంలో ప్రవేశపెట్టి తొరగా ఆమోదింపజేస్తారా..? లేదంటే అలాగే పెండింగులో పెడుతారా..? అనేది కూడా అర్థం కాకుండా ఉంది.

# అల్లు అర్జున్ ను కలవకుండానే హైదరాబాద్ నుండి వెళ్లిపోయిన పవన్ కళ్యాణ్..



**హైదరాబాద్ పెన్ పవర్:**సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అరెస్ట్ తెలుగు రాష్ట్రాల్లో కలకలం రేపిన సంగతి తెలిసిందే. నాటకీయ పరిణామాల మధ్య శుక్రవారం ( డిసెంబర్ 13, 2024 ) అరెస్టైన బన్నీ ఒకరోజు తర్వాత శనివారం ( డిసెంబర్ 14, 2024 ) మధ్యంతర బెయిల్ మీద విడుదలయ్యాడు.ఈ క్రమంలో అల్లు అర్జున్ ని కలిసి పరామర్శించేందుకు టాలీవుడ్ ప్రముఖులంతా క్యూ కట్టారు. ఇదిలా ఉండగా..ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అల్లు అర్జున్ ని కలిసి పరామర్శిస్తారని... ఇందుకోసం పవన్ గన్నవరం నుండి హైదరాబాద్ కు బయలుదేరారంటూ వార్తలు సోషల్ మీడియాలో హల్చల్ చేశాయి.అయితే.. పవన్ కళ్యాణ్ అల్లు అర్జున్ ను కలవకుండానే హైదరాబాద్ నుండి గన్నవరం బయలుదేరినట్లు తెలుస్తోంది.. శనివారం రాత్రి హైదరాబాద్ కు వచ్చిన పవన్ కళ్యాణ్ ఇవాళ తిరిగి గన్నవరం వెళ్లినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారని సమాచారం.దీంతో అల్లు అర్జున్ ను కలవకుండానే పవన్ కళ్యాణ్ గన్నవరం వెళ్లారంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. మొదట పవన్ అల్లు అర్జున్ ని కలిసి పరామర్శిస్తారంటూ ప్రచారం జరగటం, ఆ తర్వాత బన్నీని కలవకుండానే పవన్ గన్నవరం బయలుదేరటం పట్ల ఫ్యాన్స్, కార్యకర్తలు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.


## అల్లు అర్జున్ అరెస్టుతో వెళ్లిన సంకేతాలేంటి?

**హైదరాబాద్ పెన్ పవర్:**ఒక్క ఘటనతో లెక్కలు చాలానే మారిపోయాయి. ఇంతకాలం పెద్దగా పట్టించుకోని పెద్ద తలకాయలు మొదలు కొని ప్రభుత్వాలను ప్రభావితం చేసే వారి వరకు అందరిలోనూ తెలియని భయాన్ని.. అంతకు మించిన భక్తిని ప్రదర్శించాల్సిన అవసరం ఎంతన్న విషయం రేవంత్ సర్కారు స్పష్టం చేసిందన్న మాట వినిపిస్తోంది. అల్లు అర్జున్ అరెస్టుతో ఎలాంటి సంకేతాలు వెళ్లాయన్నదిప్పుడు చర్చగా మారింది.అదేమిటో కానీ.. కొందరు నేతలు సీఎం కుర్చీలో కూర్చున్నంతనే.. ఆటోమేటిక్ అందరిలోనూ ఒకలాంటి భక్తి ఆరాధాన భావన తన్నుకుంటూ వచ్చేస్తుంది. మరికొందరు ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చున్నప్పటికీ.. ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఈ విషయాలన్నీ రేవంత్ రెడ్డికి తెలియంది కాదు. కాకుంటే.. రేవంత్ ను చాలామంది సీరియస్ గా తీసుకోలేదన్న మాటే బలంగా వినిపిస్తోంది. ఎప్పుడైతే అల్లు అర్జున్ ను అరెస్టు చేసేందుకు రేవంత్ సర్కారు ఏ మాత్రం వెనుకాడకపోవటమే ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది,ఇదంతా ఒక ఎత్తు అయితే అల్లు అర్జున్ అరెస్టుపై వస్తున్న విమర్శలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూటిగా ఎలాంటి సుత్తి లేకుండా వివరణ ఇచ్చేయటంతో పాటు పుష్ప ఏమీ అమాయకుడు కాదని.. తీవ్రమైన నేరాన్ని చేశాడన్న విషయాన్ని చెప్పటం ద్వారా.. తన రాజ్యంలో తప్పులు చేసిన వారికి శిక్షలు తప్పవన్న విషయాన్ని స్పష్టం చేసినట్లుగా చెప్పాలి.

బన్నీ అరెస్టుతో రేవంత్ సర్కారు ఇచ్చిన సంకేతం ఏమిటన్నది చూస్తే.. తమకు వ్యక్తి.. అతడికి ఉండే భారీ ఇమేజ్.. రాజకీయ పలుకుబడి.. ఇతరత్రా అంశాలేమీ వర్కువుట్ కావని తప్పు చేస్తే శిక్షలు తప్పవన్న భయాన్ని ఇచ్చేసిందని చెప్పాలి. రంగం ఏమైనా కావొచ్చు.. రేవంత్ సర్కారుతో స్నేహం లేకపోవచ్చు కానీ వైరం మాత్రం పెట్టుకోకూడదన్న చర్చ బలంగా వినిపిస్తున్నట్లు చెబుతున్నారు. మొత్తంగా చూస్తే.. రేవంత్ సర్కారు ఇమేజ్ 'పుష్ప' దెబ్బకు అమాంతం పెరిగిందన్న విషయాన్ని మాత్రం ఒప్పుకోక తప్పదు.

# పుష్ప అరెస్టుతో రేవంత్ సర్కారుకు మైలేజా? డ్యామేజా?






**హైదరాబాద్ పెన్ పవర్:**కొన్నిసార్లు అంతే అనుకోనివి.. అంచనాలకు ఏ మాత్రం అందనివి సిం'ఫుల్'గా జరిగిపోతుంటాయి. ఆ కోవలోకే వస్తుంది సూపర్ హీరో అల్లు అర్జున్ అరెస్టు వ్యవహారం. 'పుష్ప 2' ప్రీమియర్ షో సందర్భంగా హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్ లో జరిగిన తొక్కిసలాటలో ఒక మహిళా అభిమాని ప్రాణం పోగా.. ఆమె కొడుకు తీవ్రంగా గాయపడి.. గడిచిన కొద్ది రోజులుగా ఆసుపత్రిలోనే ఉన్నాడు. ఇప్పటికి స్పృహలోకి రాని పరిస్థితి. అతడి ఆరోగ్య పరిస్థితి ఎప్పటికి మెరుగు అవుతుందో తెలీని పరిస్థితి.
ఇదిలా ఉంటే.. తొక్కిసలాట కేసులో ఏ11గా ఉన్న హీరో అల్లు అర్జున్ అరెస్టు కావటం సంచలనంగా మారింది. తెలుగు రాష్ట్రాలతో పాటు జాతీయ స్థాయిలోనూ అల్లు అర్జున్ అరెస్టు అంశం హాట్ టాపిక్ గా మారటమే కాదు.. రాజకీయంగా పెద్ద ఎత్తున చర్చకు తెర తీసింది. చివరకు కేంద్ర మంత్రులు సైతం అల్లు అర్జున్ అరెస్టు వ్యవహారాన్ని ఖండించటం ఆసక్తికరంగా మారింది. బన్నీ అరెస్టుతో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరు జాతీయ స్థాయిలో మారుమోగింది. దీనికి తోడు.. అరెస్టు రోజునే జాతీయ మీడియా సంస్థకు చెందిన కార్యక్రమంలో పాల్గొనటం.. ఆ సందర్భంగా బన్నీ అరెస్టు వ్యవహారంపై ప్రశ్నలు ఎదురయ్యాయి.

ఈ ప్రశ్నలన్నింటికి ముక్తసరిగా సమాధానాలు ఇవ్వకుండా సీఎం రేవంత్ వివరంగా వివరాలు వెల్లడించారు. అంతేకాదు.. తొక్కిసలాటకు అల్లు అర్జున్ ప్రధాన కారణమన్నట్లుగా ఆయన మాటలు సాగాయి. ఇదంతా చూస్తే.. సీఎం రేవంత్ తో అల్లు అర్జున్ అరెస్టు విషయాన్ని పోలీసులు చర్చించిన తర్వాతే.. అరెస్టు వ్యవహారానికి తెర తీసినట్లుగా చెప్పాలి. గుట్టు చప్పుడు కాకుండా అల్లు అర్జున్ ఇంటకి వెళ్లిన పోలీసులు.. అరెస్టు మాటను చెప్పటం ద్వారా అల్లు ఫ్యామిలీకి ఒక్కసారిగా షాకిచ్చిన పరిస్థితి.

అల్లు అర్జున్ అరెస్టు వ్యవహారంలో ఆయన పేరుతో పాటు.. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ కు జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు ఒక్కసారిగా పెరిగిపోవటమే కాదు.. ఆయన పరపతి అమాంతం ఎక్కువైనట్లుగా ప్రచారం సాగుతోంది. ఇలాంటి వేళలోనే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎలాంటి ఎలివేషన్ వచ్చింది? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది. అల్లు అర్జున్ అరెస్టు విషయంలో జాతీయస్థాయిలో పెద్ద ఎత్తున చర్చతో పాటు తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ బ్యాక్ గ్రౌండ్ తో పాటు.. ఆయనకు హీరో అల్లు అర్జున్ కు మధ్య ఏమైనా పంచాయితీలు ఉన్నాయి? అన్నది పెద్ద ప్రశ్నగా మారింది. అయితే.. అలాంటిదేమీ లేదన్న మాట పలువురి నోట వినిపించినప్పటికీ.. సమ్ థింగ్ ఈజ్ రాంగ్ అన్న మాట పలువురి నోట వినిపించింది. మిగిలిన సంగతులు ఎలా ఉన్నా తొక్కిసలాట కేసులో బన్నీ అరెస్టు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ ఇమేజ్ ను పెద్ద ఎత్తున పెంచటమే కాదు ఆయన గురించి ఇప్పుడు అందరూ మాట్లాడుకునే స్థాయికి చేరుకున్నారు. మరి.. ఈ అరెస్టుతో ఆయనకు వచ్చిన ఎలివేషన్ మాత్రం మిక్సెడ్ అన్న మాట బలంగా వినిపిస్తోంది. ఒక స్టార్ హీరోను అరెస్టు చేయటం జైలుకు పంపటం లాంటి అంశాల వేళ.. ఒత్తిళ్లకు ఎదుర్కొన్న వైనం ఇప్పుడు చర్చగా మారింది. అదే సమయంలో ఆయనతో స్నేహంగా ఉండాల్సిన అవసరాన్ని తెలియాల్సిన వారికి చెప్పకనే చెప్పేసిందన్న మాట బలంగా వినిపిస్తోంది.

# హైదరాబాద్‌లో మరో అద్భుత నిర్మాణం.. ఖర్చు ఎన్ని కోట్లో తెలుసా!



**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ మహానగరం ఇప్పటికే విశ్వవ్యాప్తంగా గుర్తింపు సాధించింది. అదే స్థాయిలో ఐటీ సంస్థలు, టెక్నాలజీలు పుట్టుకొస్తూనే ఉన్నాయి. నిత్యం ఇక్కడ జనాభా పెరుగుతూనే ఉంది. పల్లెలు, పట్టణాల నుంచి ఇక్కడికి వలసలు పెరుగుతూనే ఉన్నాయి. ఉద్యోగం, ఉపాధి నిమిత్తం ఇక్కడికి వస్తున్న వారి సంఖ్య లక్షల్లోనే ఉంటోంది. దీంతో ఇక్కడి ట్రాఫిక్ సమస్యల గురించి ఇక చెప్పనక్కర్లేదు. ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు రేవంత్ సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది.ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టడానికి పలు ఫ్లై ఓవర్లను నిర్మిస్తున్న ప్రభుత్వం.. త్వరలోనే మరో అద్భుత నిర్మాణం జరపోబోతంది. నగరంలోని జూబ్లిహిల్స్ చెక్ పోస్టు వద్ద ఉన్న కేబీఆర్ పార్క్ నుంచి 6.3 కిలోమీటర్ల సొరంగ మార్గాన్ని నిర్మించేందుకు నిర్ణయించింది. పర్యాటకులను ఆకట్టుకోవడమే కాకుండా.. ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఈ అద్భుతమైన ప్రాజెక్టును నిర్మించబోతోంది. కేబీఆర్ పార్క్ కింది నుంచి సొరంగం మార్గాన్ని ఏర్పాటుచేసేందుకు ఇప్పటికే కసరత్తు మొదలైంది. టన్నెల్ నిర్మాణంపై సాధాసాధ్యాలపైనా అధ్యయనం పూర్తికాగా.. దానికి సంబంధించి పనులు చకచకా జరుగుతున్నాయి.హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల నుంచి ఐటీ కారిడార్‌కు సులువుగా రాకపోకలు సాగేందుకు.. పర్యాటకులను ఆకర్శించేందుకు దుర్గం చెరువు కేబుల్ వంతెనకు కొనసాగింపుగా ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మిస్తే దేశంలోనే రెండో అతిపెద్ద సొరంగ మార్గం కానుంది. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45 నుంచి కేబీఆర్ పార్క్ ప్రవేశ ద్వారం వరకు 1.70 కిలోమీటర్లు, కేబీఆర్ ప్రధాన ప్రవేశ ద్వారం నుంచి ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వరకు 2 కిలోమీటర్లు, బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12 టన్నెల్ జాయింట్ పాయింట్ 1.10కిలోమీటర్లు, అప్రోచ్ రోడ్లు 1.50 కి.మీ కలిపి మొత్తం 6.30 కి.మీ ఈ సొరంగ మార్గం నిర్మించనున్నారు.అలాగే.. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి, మహారాజ అగ్రసేన్, ఫిలింనగర్, జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 45, చెక్‌పోస్టు, కేబీఆర్ పార్కు ప్రధాన గేటు కూడళ్లలో రూ.1,200 కోట్లతో ఏడు స్టీల్ బ్రిడ్జిలు, ఆరు అండర్ పాస్‌లను నిర్మించనున్నారు. బంజారాహిల్స్ నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వరకు చేయనున్న రోడ్డు విస్తరణ ప్రాజెక్టు కోసం రూ.150 కోట్లు చేయనున్నారు. రోడ్డు పొడవు 6.5 కిలోమీటర్లు కాగా.. 306 నిర్మాణాలను కూల్చివేసేందుకు నిర్ణయించారు. వీటిలో 86 నివాసాలకు మార్కింగ్ చేశారు.

## రేవంత్ రెడ్డికి గతం గుర్తు చేసిన ఆర్జీవీ!



**హైదరాబాద్ పెన్ పవర్:**సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనకు సంబంధించిన కేసులో అల్లు అర్జున్ అరెస్టవ్వడం.. రిమాండ్, బెయిల్, విడుదల వంటి విషయాలు శనివారం ఉదయంతో ముగిసిన సంగతి తెలిసిందే. అయితే ఆ అరెస్టుకు సంబంధించిన ప్రకంపనలు మాత్రం ఇంకా తీవ్రంగానే వినిపిస్తున్నాయని అంటున్నారు.

ఆ సంగతి అలా ఉంటే...

మరోపక్క ఈ వ్యవహారంపై సినీ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తనదైన శైలిలో స్పందిస్తున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టచ్ చేస్తున్నారనే కామెంట్లు వినిపిస్తున్నాయి! ఈ క్రమంలో ఇప్పటికే అల్లు అర్జున్ కు తెలంగాణ సర్కార్ రిటన్ గిఫ్ట్ ఇచ్చిందటూ కామెంట్ చేశారు.

ఇందులో భాగంగా... తెలంగాణకు చెందిన అల్లు అర్జున్ భారతీయ సినిమా చరిత్రలోనే బిగ్గెస్ట్ హిట్ మూవీని అందించి.. రాష్ట్రానికి గొప్ప బహుమతిని అందించారు కానీ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అల్లు అర్జున్ ను జైలుకు పంపి రిటర్న్ గిఫ్ట్ ఇచ్చింది అని రామ్ గోపాల్ వర్మ ట్వీట్ చేశారు. దీంతో... రేవంత్ ను కెలకడం అవసరమా అనే చర్చ తెరపైకి వచ్చింది.పైగా... తొక్కిసలాటలో ఓ మహిళ మృతి చెందితే, ఆమె కుమారుడు ఆస్పత్రిలో సీరియస్ కండిషన్స్ లో ఉంటే స్పందించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని.. ఇందులో మరో ఉద్దేశ్యం ఏమీ లేదని రేవంత్ రెడ్డి స్పష్టంగా చెప్పిన తర్వాత కూడా ఆర్జీవీ ఇలా స్పందించడం గమనార్హం. ఈ సమయంలో రేవంత్ రెడ్డికి గతం గుర్తు చేస్తూ ఓ వీడియో విడుదల చేశారు ఆర్జీవీ.అవును... అల్లు అర్జున్ %-% రేవంత్ రెడ్డి అరెస్ట్ లో కామన్ పాయింట్ ఏమిటి అంటూ నెటిజన్ అడిగిన ప్రశ్నకు స్పందించిన ఆర్జీవీ... వాళ్లిద్దరూ తమ తమ బెడ్ రూమ్స్ ఉన్నప్పుడే అరెస్టు అయ్యారంటు సంచలన పోస్ట్ పెట్టారు!కాగా... గతంలో రేవంత్ రెడ్డిని పోలీసులు ఇంటిలోనికి వెళ్లి, బెడ్ రూమ్ లో ఉండగా మరీ అరెస్ట్ చేయగా... తాజాగా తనను అరెస్ట్ చేయడం తప్పు కాదు కానీ మరీ బెడ్ రూమ్ వరకూ వచ్చి అరెస్ట్ చేయడం టూమచ్ అంటూ అల్లు అర్జున్ కామెంట్ చేసిన సంగతి తెలిసిందే! ఈ నేపథ్యంలో ఈ రెండింటినీ మిక్స్ చేసి స్పందించిన ఆర్జీవీ... రేవంత్ కు గతం గుర్తు చేస్తున్నారంటూ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్లు.